సాక్షి కామారెడ్డి


శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



త్వరలో ఆరు గ్యారంటీలు..

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను త్వరలో అమలు చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸



నేడు కమిటీ రాక

నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ పునరుద్ధరణ కమిటీ శనివారం బోధన్ షుగర్ ఫ్యాక్టరీ సందర్శనకు రానుంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

32.3 / 14.6

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగవచ్చు.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్ బదిలీ



సాక్షి, కామారెడ్డి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరి సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన గతేడాది జూలై 18న జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో ఏడు నెలలపాటు విధులు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. పదోన్నతిపై వెళ్తున్న మను చౌదరిని పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కార్యదర్శులు సన్మానించారు.

ఇద్దరు ఏపీపీల తొలగింపుపై స్టే

సాక్షి, హైదరాబాద్: బోధన్ కోర్టులకు చెందిన ఇద్దరు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తొలగింపుపై స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సత్యంరావు, సోమయ్య.. బీఆర్ఎస్ నిర్వహించిన ఎన్నికల సభలో పాల్గొన్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై బోధన్ ఎస్‌హెచ్‌వో ప్రజాప్రతినిధ్య చట్ట ప్రకారం కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు ఏపీపీలుగా ఇద్దరిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేసు, తొలగింపును సవాల్ చేస్తూ సత్యంరావు, సోమయ్య హైకోర్టును ఆశ్రయించగా.. విచారణ చేపట్టిన జస్టిస్ కె.సుజన ధర్మాసనం.. తొలగింపుపై స్టే విధిస్తూ విచారణను వాయిదా వేసింది.

'లైసెన్స్‌ల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి'

తాడ్వాయి: డీలర్లు తమ లైసెన్స్‌లను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం కృష్ణాజీవాడిలోని రైతు వేదికలో ఎల్లారెడ్డి డివిజన్‌లోని పురుగుల మందుల డీలర్లకు ఆన్‌లైన్ లైసెన్స్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్‌లు పొందిన డీలర్లు మాత్రమే షాపులను నడిపించాలన్నారు. మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. నకిలీ విత్తనాలు, మందులను అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సహాయ సంచాలకులు రత్న, భారతి, ఏవోలు శ్రీకాంత్, అనిల్, నరేష్, విజయ్‌శేఖర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

'గాయత్రి షుగర్స్'లో ఐఎన్‌టీయూసీ విజయం



సదాశివనగర్: అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ఐఎన్‌టీయూసీ గెలిచింది. మొత్తం 230 ఓట్లు పోలవ్వగా.. ఐఎన్‌టీయూసీకి 113, బీఎంఎస్‌కు 107, సీపీఎంకు 13 ఓట్లు వచ్చాయి. విజయం సాధించిన ఐఎన్‌టీయూసీ సభ్యులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఫ్యాక్టరీ గౌరవాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి మహేశ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

'సిబ్బంది సమయపాలన పాటించాలి'



దోమకొండ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలని రిజిస్ట్రేషన్ స్టాంప్స్ డిపార్టుమెంట్ డీఐజీ రమేశ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉందన్నారు. ప్రభుత్వం పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా డాక్యుమెంట్‌లు పరిశీలించాలని సూచించారు. సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట దోమకొండ సబ్ రిజిస్ట్రార్ జబ్బార్, సిబ్బంది అవేజ్, శ్రీనివాస్, రాజు, భవాని, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల్లో వణుకు!

వడ్డీ వ్యాపారుల అడ్డాలపై పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. గురువారం పలు ప్రాంతాలలో దాడులు చేసి 14 కేసులు నమోదు చేసిన పోలీసులు.. శుక్రవారం రెండో రోజూ కొరడా ఝుళిపించారు. దీంతో అడ్డగోలు వడ్డీలు వసూలు చేస్తున్న వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

రెండోరోజూ కొనసాగిన దాడులు

- అడ్డగోలు వసూళ్ల లెక్క తేలుస్తున్న పోలీసులు
- సర్దుకున్న కొందరు వ్యాపారులు
- ఫైనాన్స్‌లు, చిట్‌ఫండ్‌లపైనా దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు



సాక్షి, కామారెడ్డి : జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ సింధు శర్మ చర్యలు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ బృందాలతో వడ్డీల దందా నిర్వహిస్తున్న వారి వివరాలను సేకరించి, దాడులు చేయిస్తున్నారు. ఎస్పీ ఆదేశాలతో గురువారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు సోదాలు నిర్వహించి 14 మందిపై కేసులు నమోదు చేశారు. ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్లు, ఆస్తుల తనఖా పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కూడా జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. దీంతో వడ్డీ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. కాగా కొందరు జాగ్రత్త పడినట్టు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున దందా నడిపేవారు బడాబాబులు కావడంతో వారు సర్దుకున్నట్టు తెలుస్తోంది.

అనుమతి లేని ఫైనాన్సులెన్నో...

ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం నిర్వహించాలంటే రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అయితే చాలామంది ఎలాంటి అనుమతులు లేకుండానే ఫైనాన్స్, చిట్టీల దందాలు నడుపుతున్నారు. ఈ వ్యాపారంలో ఏటా రూ.కోట్ల టర్నోవర్ చేసేవాళ్లున్నారు. ఒక్క కామారెడ్డి పట్టణంలోనే వందలాది అనుమతిలేని ఫైనాన్స్‌లు, చిట్స్ నడుస్తున్నాయి. డబ్బుల అవసరం ఉందని వీరి వద్దకు వెళ్లేవారికి అడ్డగోలు వడ్డీకి అప్పులిస్తున్నారు. ప్రామిసరీ నోట్ల మీద సంతకాలు తీసుకుంటున్నారు. కొందరైతే ఆస్తి పత్రాలను తనఖా పెట్టుకుని అప్పులు ఇస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటి పత్రాలు, ప్లాట్లు, భూముల పాసుపుస్తకాలు తనఖా పెట్టి అప్పు తీసుకుంటున్నారు. అప్పు తీసుకున్నవారు సమయానికి తీర్చకపోతే.. లేదా వడ్డీ చెల్లించడంలో ఆలస్యమైతే మిత్తికిమిత్తి వసూలు చేస్తున్నారు. దీంతో అప్పు భారం పెరిగి తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లోకి వెళ్తున్నారు. దీన్ని అదనుగా తీసుకుని వడ్డీ వ్యాపారులు రుణగ్రహీతల ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు.

రిజిస్టర్డ్ చిట్స్, ఫైనాన్సుల్లోనూ మోసాలు...

జిల్లాలోని పలు రిజిస్టర్డ్ ఫైనాన్సు కంపెనీలూ మోసాలకు పాల్పడుతున్నాయి. ఒక్కో చిట్‌ఫండ్ సంస్థ రెండు, మూడు చిట్స్‌కు అనుమతులు తీసుకుని.. ఇరవై, ముప్పై గ్రూపుల చిట్టీలు నడుపుతున్నాయి. సంబంధిత అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి మెనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చిట్ తీసుకున్నవారికి సకాలంలో డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న సంస్థలెన్నో ఉన్నాయి. నిర్ణీత సమయంలో చిట్ డబ్బులు ఇవ్వకుండా నెలలు, సంవత్సరాల తరబడి తిప్పుకుంటున్నారు. అదే చిట్ తీసుకున్న సభ్యుడు ఒకటి, రెండు నెలలు డబ్బులు చెల్లించకుంటే మాత్రం జరిమానాలు విధిస్తున్నారు. ష్యూరిటీ ఇచ్చిన వ్యక్తులకు నోటీసులు పంపుతూ ఇబ్బందులు పెడుతున్నారు. ప్రముఖ చిట్స్, ఫైనాన్స్ సంస్థల్లోనూ తనిఖీలు నిర్వహిస్తే ఎన్నో అక్రమాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి. అనుమతి లేనివాటితో పాటు అనుమతులు పొందిన వాటిపైనా పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది పెద్ద ఎత్తున ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నారు. వారి వ్యాపార లావాదేవీలపై దృష్టి పెడితే చాలా విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో పోలీసు శాఖ మరింత లోతైన విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బిచ్కుందలో ముగ్గురిపై కేసులు..

బిచ్కుంద: మండల కేంద్రంలో శుక్రవారం ఏడుగురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు దాడులు చేశారు. ముగ్గురు వ్యాపారుల ఇళ్లలోంచి డాక్యుమెంట్లు, బాండ్ పేపర్లు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు. నాగ్‌నాథ్, సచిన్, లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ చేసుకుంటూ రుణాలు..

వడ్డీ వ్యాపారులు పూచీకత్తు కింద భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని అప్పులు ఇస్తున్నారు. గడువులోగా వడ్డీతో సహా అప్పు చెల్లించకపోతే ఆ భూమిని స్వాధీనం చేసుకుంటున్నారు. వడ్డీతో సహా అప్పు చెల్లించినా కొందరు వ్యాపారులు భూమిని తిరిగివ్వడానికి సతాయిస్తున్నట్లు తెలుస్తోంది. బిచ్కుందలోని ఓ కిరాణ దుకాణం నిర్వాహకుడి వద్ద గిరిజన రైతు ఒకరు అప్పు తీసుకున్నారు. అయితే డబ్బులు చెల్లించినా తిరిగి భూమి ఇవ్వడం లేదని సదరు రైతు నాలుగు రోజుల క్రితం బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అలాగే రెండేళ్ల క్రితం బిచ్కుందకు చెందిన ఓ వడ్డీ వ్యాపారి వద్ద అప్పు తీసుకున్న మద్నూర్ మండలం మొగ గ్రామానికి చెందిన ఒక రైతు.. అప్పు చెల్లించినా తన భూమిని ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.. జిల్లావ్యాప్తంగా వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరుతుండడంతో వీరికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు దాడులు చేస్తున్నారు.

'మళ్లీ మోదీనే పీఎం'



బైక్ యాత్ర చేస్తున్న మాతాజీ రాజ్యలక్ష్మికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ మళ్లీ గెలవడం, మోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని బైక్ యాత్రికురాలు మాతాజీ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి పీఎం కావాలని ఆకాంక్షిస్తూ మధురై నుంచి ఢిల్లీ వరకు 21 వేల కిలోమీటర్ల బైక్ యాత్ర చేపట్టిన మాతాజీ రాజ్యలక్ష్మి.. శుక్రవారం కామారెడ్డికి చేరుకున్నారు. ఆమెకు బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత, మహిళలు మోదీ వెంటే ఉన్నారన్నారు. మోదీ మూడోసారి ప్రధాని కావాలని 21 వేల కిలోమీటర్ల బైక్ యాత్ర చేపట్టానన్నారు. ఈనెల 12 న తమిళనాడులో ప్రారంభమైన యాత్ర ఏప్రిల్ 18 న ఢిల్లీకి చేరుకుంటుందన్నారు. యాత్రకు కామారెడ్డి బీజేపీ శ్రేణులు మద్దతు తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, రాజేష్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం కుదిరింది!

- 27 న మరో రెండు గ్యారంటీల అమలు
- దరఖాస్తుదారుల్లో ఆనందం

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రెస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసిన సర్కారు.. మరో రెండు హామీలను ఈనెల 27వ తేదీనుంచి అమలు చేయాలని నిర్ణయించింది. 200 యూనిట్లలోపు గృహవిద్యుత్ వాడుకునే వారికి ఉచిత విద్యుత్ అందించడంతోపాటు రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి 2.36 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ఎక్కువ శాతం రెండు వందల యూనిట్లలోపు వాడుకునే కుటుంబాలకు సంబంధించినవే.. వీరందరికి ఉచిత విద్యుత్ అందే అవకాశాలున్నాయి. అలాగే జిల్లాలో 2.53 లక్షల కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. తెల్ల రేషన్ కార్డుదారులందరికీ రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లావ్యాప్తంగా 3.21 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో 2 లక్షల పైచిలుకు మందికి సబ్సిడీపై సిలిండర్ అందే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ప్రభుత్వం మరో రెండు గ్యారంటీల అమలుకు ముహూర్తం ఖరారు చేయడంతో దరఖాస్తుదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఆ'పాత' మధురం!

1971 ఫిబ్రవరి 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలపై హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. నాటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి, పీసీసీ చీఫ్ నర్సిరెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో కామారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అప్పటి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు. 53 ఏళ్ల నాటి చిత్రమిది.. – సాక్షి, కామారెడ్డి



1971లో అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి, పీసీసీ చీఫ్ నర్సిరెడ్డిలతో ఆర్.వెంకట్రాంరెడ్డి

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- ఆదాయంపై దృష్టి సారించాలి
- బల్దియా బడ్జెట్ సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్
- రూ. 42.28 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్ : ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కళాభారతిలో మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌన్సిలర్లకు అభివృద్ధి పనులు చేపట్టాలన్న తాపత్రయం ఉండాలన్నారు. మున్సిపల్ బడ్జెట్‌తో పాటు ఇతర శాఖల సహకారం, ప్రభుత్వం నుంచి ఇతర గ్రాంట్ల రూపంలో వచ్చే నిధులతో పట్టణంలో తాగునీటి సౌకర్యం తదితర వాటికి ఖర్చు చేస్తామన్నారు. ఆదాయ వనరుల పెంపునకు కౌన్సిల్ సభ్యులు మార్గాలు అన్వేషించాలని సూచించారు. వాణిజ్య ప్రాంతాలలో యూజర్ చార్జీల ద్వారా వంద శాతం పన్ను వసూళ్లతో ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, మంచినీరు వృథా కాకుండా ప్రతి ఒక్కరు కుళాయిలు పెట్టుకునేలా చూడాలని కోరారు. వైకుంఠ ధామాలు వాడుకలోకి వచ్చేలా చూస్తామంటూ సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. జనాభా ప్రాతిపదికన శానిటేషన్ కార్మికులను కేటాయించాలని అదనపు కలెక్టర్ మను చౌదరి సూచించారు. సమావేశంలో కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఇలా..

2024–25 సంవత్సరానికి రూ. 42.28 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. అలాగే 2023–24 సంవత్సరానికి సవరించిన రూ. 36.66 కోట్ల బడ్జెట్‌కు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందులో పన్నుల రూపంలో రూ. 12.95 కోట్లు, అద్దెలు, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ మార్గాల ద్వారా రూ. 13.68 కోట్లు, డిపాజిట్లు, లోన్ల ద్వారా రూ. 22 లక్షలు, క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్స్ ద్వారా రూ. 1.42 కోట్లు వస్తాయని అంచనా వేశారు. బడ్జెట్ లోంచి జీతాలు, శానిటేషన్, విద్యుత్ బిల్లులకు రూ. 2.16 కోట్లు, గ్రీన్ బడ్జెట్ కోసం రూ. 2.96 కోట్లు వెచ్చించనున్నారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, సాధారణ పరిపాలన ఖర్చులు రూ. 2.38 కోట్లు, వార్డు వారీగా చేపట్టిన పనులు, ప్రజోపయోగ పనులకు రూ 22.33 లక్షలు, డిపాజిట్లు, లోన్లల కింద రూ. 22 లక్షలు, నాన్ ప్లాన్ గ్రాంట్ కింద రూ. 15.42 కోట్లు ఖర్చు చేయడానికి రూపొందించిన ప్రణాళికకు సభ ఆమోదం తెలిపింది.

రసాభాసగా బల్దియా సమావేశం

- కౌన్సిల్‌ను తప్పుదోవ పట్టించేలా ఎజెండా ఉందన్న విపక్షాలు
- 11 ఎజెండా అంశాలపై డీసెంట్ నోటీసులిచ్చిన కాంగ్రెస్
- మెజారిటీ సభ్యుల డిమాండ్‌తో సమావేశం వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ వనిత



సమావేశానికి హాజరైన సభ్యులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఎజెండా అంశాలు కౌన్సిల్‌ను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు వాగ్వాదానికి దిగాయి. సమావేశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీంతో మెజారిటీ సభ్యుల డిమాండ్ మేరకు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు.

జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం మధ్యాహ్నం కామారెడ్డి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. బల్దియాను ఆర్థికంగా నష్టపరిచే విధంగా ఎజెండా ఉందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ సమావేశాన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ సభ్యులు చైర్‌పర్సన్, కమిషనర్‌లకు వినతిపత్రం అందించారు. ఎజెండా అంశాలపై విచారణ జరిపిన తర్వాత సమావేశం నిర్వహించాలని కోరారు. అలాగే ఎజెండాలోని 11 అంశాలపై 11 డీసెంట్ నోటీసులను 21 మంది కాంగ్రెస్ సభ్యులు సంతకాలు చేసి అందించారు. టెండర్ లేకుండా పనులు, కాంట్రాక్టర్‌లకు మేలు చేసేలా అంశాలు, రహస్య టెండర్‌ల నిర్వహణ, హరితహారంలో తప్పుడు లెక్కలు, ఒక్క 18వ వార్డుకే వీధిదీపాలు మంజూరు, జనరల్ ఫండ్ నిధుల చెల్లింపుల్లో అక్రమాలు, ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపులు, నిధుల కొరత, అక్రమంగా కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం, ఇన్‌చార్జి సానిటరీ ఎస్సైని పర్వేజ్‌కు రూ. 13 లక్షలు ముందస్తు చెల్లింపులు, అదనపు కార్మికుల పేరిట బిల్లుల చెల్లింపులో అక్రమాలు, చట్ట విరుద్ధంగా ఓ అసోసియేషన్‌కు 500 గజాల స్థలం కేటాయించడం, కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారంటూ ఆయా అంశాలతో డీసెంట్ నోటీసులు ఇచ్చి సమావేశంలో ఆందోళన చేశారు. డీసెంట్ నోటీస్ ఇచ్చాక సమావేశంలో మాట్లాడే అర్హత కాంగ్రెస్ సభ్యులకు లేదని, సమావేశాన్ని కొనసాగించాలని బీఆర్ఎస్ సభ్యులు వాదించారు. ఈ క్రమంలో రెండుసార్లు సమావేశాన్ని చైర్‌పర్సన్ 10 నిమిషాల పాటు వాయిదా వేశారు. అత్యవసరమైన కార్మికుల వేతనాలు, సానిటేషన్ వాహనాల ఇంధన బిల్లుల చెల్లింపులకు సంబంధించి 6, 10, 11, 12 అంశాలను ఆమోదించవచ్చని కమిషనర్ సుజాత వివరణ ఇవ్వడంతో ఆ అంశాలను ఆమోదించారు. ఎజెండాలోని అంశాలను ప్రశ్నిస్తూ బీజేపీ సభ్యులు సైతం సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు. దీంతో మెజారిటీ సభ్యుల డిమాండ్ మేరకు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం అండర్–14, 16, 18, 20 బాలబాలికలకు 400 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో కలిపి ఎంపిక పోటీల్లో 708 క్రీడాకారులు పాల్గొనగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

క్రీడాకారులను అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశ్వరగౌడ్, పాక వెంకటి, భాస్కర్‌రెడ్డి, హన్మంతురెడ్డి, శివాగౌడ్, లక్ష్మణ్‌రాథోడ్, ప్రభులింగం, రేణుక, అరుణ, స్వప్న, దివ్య, ప్రియాంక, విజయ, స్వర్ణలత తదితరులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఎంపికైన క్రీడాకారులు

ఎం.మోహన్, ఎల్.యోగి, బి.సంజన, బి.రామముక్తశ్రీ, బి.లోకేష్‌వర్త, ఎన్.అభిలాష్‌గౌడ్, డి.సోని, బి.కీర్తన, ఎం.మహేందర్, ఎం.ఉదయ్‌కిరణ్.

'యువత చేతిలోనే దేశ భవిత'

కామారెడ్డి క్రైం: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై యువతకు అవగాహన కల్పించడానికి ఎంపిక చేసిన క్యాంపస్ అంబాసిడర్‌లకు శుక్రవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశం పురోగమించాలంటే మంచి నాయకత్వం ఉండాలన్నారు. అందుకు అవకాశాన్ని రాజ్యాంగం మనకు ఓటు హక్కు ద్వారా కల్పించిందన్నారు. జూనియర్ కళాశాలల్లో ప్రతి తరగతిని సందర్శించి 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని అంబాసిడర్‌లకు సూచించారు. చట్టాలు, రాజకీయాలపై యువతకు కనీస పరిజ్ఞానం ఉండాలన్నారు. మద్యం, డబ్బులాంటి ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

క్లుప్తంగా

పీజీ పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ మొదటి సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ పీజీ 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. పరీక్షలకు 1,911 మందికి 1,810 మంది హాజరు కాగా 101 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ నమోదు కాలేదని తెలిపారు.

27న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ: పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 27న నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ గణేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ మండలంలోని గుండారం క్లాసిక్ పేపర్ మిల్‌లో పీఎఫ్ కార్యాలయ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సీహెచ్‌వీ శ్రావణ్‌కుమార్, కామారెడ్డిలోని కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పింఛన్‌దారులు తగిన ఆధారాలతో కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

హాల్ టికెట్స్ విడుదల

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా (సీవోఈ) కళాశాలల మొదటి ప్రవేశ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థుల సెకండ్ లెవల్‌కు సంబంధించిన హాల్ టికెట్స్ విడుదలైనట్లు సుద్దపల్లి కళాశాల ప్రిన్సిపల్ గోదావరి శుక్రవారం తెలిపారు. హాల్ టికెట్లను www.tswreis.ac.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, బోనాఫైడ్, కుల ధృవీకరణపత్రం తీసుకురావాలని సూచించారు.

తిప్పాపూర్ వాసికి 4వ ర్యాంకు



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన నాగార్తి రాజశేఖరరెడ్డి అనే యువకుడు జూనియర్ అకౌంట్స్ పరీక్ష ఫలితాల్లో నాల్గో ర్యాంకు సాధించాడు. ప్రభుత్వం గురువారం రాత్రి విడుదల చేసిన ఫలితాల్లో ఆయన నాలుగో ర్యాంకు సాధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో జూనియర్ అకౌంట్ అధికారిగా ఎంపికయ్యారు. రాజశేఖరరెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి వ్యవసాయదారుడు తల్లి నిర్మల గృహిణి.

కేజీబీవీపై ఆరోపణలు అవాస్తవం

బోధన్: రుద్రూర్‌లోని కేజీబీవీ పై వస్తున్న ఆరోపణలు అవాస్తమని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. న్యూస్ కవరేజీకి రావాల్సిందిగా పిలవడంతో వెళ్లిన విలేకరులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేర్‌వెల్ పార్టీ కోసం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు వార్తలు రావడంపై మండిపడ్డారు. విద్యార్థి సంఘం నాయకుల ఫిర్యాదులను తప్పుబట్టారు. ఈ క్రమంలో సెల్ ఫోన్‌లో ఫొటోలు తీస్తున్న 'సాక్షి' విలేకరితో పాటు మరికొందరి విలేకరులను నెట్టేసి వారి ఫోన్లను కిందపడేశారు. దీంతో విలేకరులు రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మొండిచేయి..!

- వేతనాల పెంపునకు ప్రతిపాదించని రాష్ట్ర అధికారులు
- క్రమబద్ధీకరణ, ఎంటీఎస్ కోసం ఉద్యమాలు చేస్తున్న ఉద్యోగులు
- నిధుల కేటాయింపు పెంచని కేంద్ర ప్రభుత్వం
- నేడు సీఎం ఇంటికి తరలివెళ్లనున్న ఉద్యోగులు



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు (ఫైల్)

ఆర్మూర్: రెండు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తూ క్రమబద్ధీకరణ, మినిమమ్ టైం స్కేల్, పలు డిమాండ్లతో ఉద్యమాలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఈ విద్యా సంవత్సరం సైతం మొండి చేయి ఎదురు కానుంది. 2024–25 ఏడాదికి గాను రాష్ట్ర స్థాయి అధికారులు రూ.2,500 కోట్ల ప్రతిపాదనలు పెట్టగా కేంద్రం గతేడాది మాదిరిగానే రూ.1,913 కోట్లు మంజూరు చేయడానికి కమిట్మెంట్ ఇచ్చింది. దీంతో సమగ్ర శిక్ష పరిధిలో గతేడాది కొనసాగిన కార్యక్రమాలే ఈ ఏడాది కొనసాగనున్నాయి. సమగ్ర శిక్ష పరిధిలోని 17 విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల ఉద్యోగాల క్రమబద్ధీకరణ, వేతనాలు సైతం పెరగని పరిస్థితి కనబడుతోంది. గతేడాది బడ్జెట్‌నే కేంద్రం మంజూరు చేస్తుండటంతో రాష్ట్ర స్థాయి అధికారులు సైతం వేతనాల పెంపును ప్రతిపాదించకుండా ఉండిపోయారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వస్తే కాంట్రాక్టు అనే పదం ఉండకుండా తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తాడని కేసీఆర్‌ను నమ్మి పదేళ్లు గోస పడ్డ ఉద్యోగులు ఇప్పుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం చేయాలంటూ వినతులు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సమగ్ర శిక్ష పరిధిలో జిల్లాలో కేజీబీవీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ కలిపి 571 మంది, యూఆర్ఎస్ టీచింగ్, నాన్ టీచింగ్ కలిపి 10 మంది, డీపీవో స్టాఫ్ 9, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 22, సీసీవోలు 29, సీఆర్పీలు 94, ఐఈఆర్పీలు 49, మెసెంజర్స్ 19, పీటీఐలు 88, సీజీవీలు 19 మంది విధులు నిర్వహిస్తున్నారు.

నేడు హైదరాబాద్‌కు..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు సమ్మె బాట పట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా శిబిరాలను టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి సందర్శించి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం హైదరాబాద్‌లోని సీఎం కేసీఆర్ నివాసానికి పెద్దఎత్తున వెళ్లి తమ బాధలను విన్నవించుకోడానికి ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు తరలి రావాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.

కేంద్రంలో వచ్చేది మోదీ ప్రభుత్వమే..

- చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తాం
- ఎంపీ ధర్మపురి అర్వింద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఎడపల్లి: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పక్కా అని, నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎడపల్లి మండలంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బోధన్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీలో పనిచేసే వారికి గుర్తింపు.. పదవులు లభిస్తాయని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. తాను ఎమ్మెల్సీ కవితలా కమీషన్లకు కక్కుర్తి పడే వ్యక్తిని కాదన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై కాంగ్రెస్ పార్టీ కమిటీల పేరిట కాలయాపన చేస్తోందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 53 షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించిందని, బోధన్ షుగర్ ఫ్యాక్టరీని సైతం బీజేపీయే తెరిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాయకులు నర్సింహారెడ్డి, సుధాకర్ చారి, కుర్లెళ్ల శ్రీధర్, కోలా ఇంద్రకరణ్, రెంజల్ జెడ్పీటీసీ మేక విజయసంతోష్, ఉప్పు సురేశ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం..



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- ఖిల్లా రామాలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- భారీగా తరలివచ్చిన భక్తులు

డిచ్‌పల్లి: దీక్షాపుర నివాసా.. సీతారామస్వామి.. గోవిందా.. గోవిందా.. అంటూ ఖిల్లా డిచ్‌పల్లి రామనామస్మరణతో పులకించిపోయింది. ఇందూరు జిల్లా కీర్తి కిరీటంగా ప్రసిద్ధి పొందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి గ్రామంలో వైభవంగా ఊరేగించారు. ముందుగా ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఉదయం నిత్య హోమం, బలిహరణం, సాయంత్రం హోమం, బలిహరణం, రథ ప్రతిష్ట, రథహోమం, బలిహరణం అనంతరం వైభవంగా రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. యాజ్ఞికులు శ్రీదరాచార్యులు, నాని పంతులు, ప్రవీణ్ దేశ్‌పాండే, పూజారులు రెండు గంటల పాటు రథహోమం, బలిహరణం, పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. రథోత్సవ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పది గంటలకు ప్రారంభమైన రథోత్సవం తెల్లవారుఝాము 3 గంటల వరకు కొనసాగింది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో రథాన్ని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్త, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, సర్పంచ్ గడ్డం రాధకిష్టారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, ఆలయ డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సూర మాధురి, సున్నం పోశెట్టి, ఆసది జితేందర్, వీడీసీ సభ్యులు తోట చిన్న సాయిలు, వారాల సాయిలు, మాజీ సర్పంచులు బూస సుదర్శన్, ఏజీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వనవిహారం, చక్రతీర్థం

ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామ శివారులోని అంగడి మామిళ్ల వద్ద శ్రీసీతారాముల వనవిహారం (జాతర), చక్రతీర్థం నిర్వహించనున్నారు. సాయంత్రం గజసేవ కార్యక్రమం ఉంటుందని ఆలయ ప్రధానార్చకుడు సుమిత్‌శర్మ దేశ్‌పాండే తెలిపారు.

లాస్య నందితకు వల్లభాపూర్‌తో అనుబంధం

మాక్లూర్: హైదరాబాద్‌లో శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్యనందిత(37)కు మండలంలోని వల్లభాపూర్ గ్రామంతో అనుబంధం ఉంది. కంటోన్మెంట్ నుంచి 4సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన జి సాయన్న నందిత తండ్రి ఆయన స్వగ్రామం మాక్లూర్ మండలంలోని వల్లభాపూర్. సాయన్న ఇక్కడే పుట్టి పెరిగి, విద్యాభ్యాసం అనంతరం హైదరాబాద్‌లో వివాహం చేసుకుని అక్కడే స్థిరపడ్డారు. ఆయన ముగ్గురు కుమార్తెల్లో లాస్య నందిత ఒకరు. నందిత తండ్రితో కలిసి నాలుగుసార్లు గ్రామానికి వచ్చినట్లు కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపారు. నందిత తండ్రి తరఫు బంధువులు అయిన పెద్దమ్మ గైని పోసాని, అత్తమ్మ మల్కమ్మ, అన్నయ్యలు రవి, సంజీవ్, అక్కలు, బావలు వల్లభాపూర్‌లోనే ఉంటున్నారు. లాస్య మృతితో గ్రామంలో విషాదచాయలు అలుము ఉన్నాయి.

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీకి ఎంపిక



కామారెడ్డి అర్బన్ : తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక లయోలా హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. మార్చి 2, 3, 4వ తేదీల్లో నాగార్జునసాగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు జిల్లా తరఫున పాల్గొంటారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేశ్వరగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వెంకటి, అనిల్‌కుమార్, హన్మంత్‌రెడ్డి, మోహన్ రెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్ర పోటీలకు ఎంపికైది వీరే..

సుధాకర్, వంశీ, సంగమేశ్వర్, జ్ఞానేశ్వర్, నవీన్, నరేందర్, రాజు, సాయికిరణ్‌గౌడ్, సందీప్‌కుమార్, గంగాధర్, గోపి, మధుసూదన్ ఎంపికయ్యారు.

నేడు నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ రాక



బోధన్ నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్డీఎస్ఎల్) ముఖచిత్రం (ఫైల్)

బోధన్: ఎన్డీఎస్ఎల్(నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్) పునరుద్ధరణ కమిటీ శనివారం బోధన్ షుగర్ ఫ్యాక్టరీ సందర్శనకు రానుంది. ఉదయం 11 గంటలకు కమిటీ రానుండడంతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం, ఫ్యాక్టరీ యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. కమిటీ సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో ఫ్యాక్టరీ స్థితిగతులు పరిశీలించి, పునరుద్ధరణకు సాధ్యాసాధ్యాలు, విధివిధానాల రూపకల్పన కోసం కార్మికులు, చెరుకు రైతులతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూతపడిన నిజాంషుగర్స్ యూనిట్లను తెరిపించేందుకు కమిటీని నియమించి, చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చైర్మన్‌గా, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కో–చైర్మన్‌గా, బోధన్, మెదక్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, రోహిత్‌రావు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక ప్రత్యేక కార్యదర్శి, పరిశ్రమ, వాణిజ్య శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీ, వ్యవసాయ, సహకార శాఖల రాష్ట్ర కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ షుగర్, కేన్ కమిషనర్‌లను సభ్యులుగా ప్రత్యేక కమిటీని నియమిస్తూ జనవరి 12న రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. కమిటీ ఈ నెల 20న బోధన్‌కు రావాల్సి ఉండగా వాయిదా పడింది.

మధ్యాహ్న భోజనం పరిశీలన



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం క్యాంప్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గురుకుల పాఠశాలల్లో శుక్రవారం బాన్సువాడ ఎంపీపీ దొడ్ల నీరజారెడ్డి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పాఠశాలలో సమస్యలపై ఆరాతీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం చికెన్, గుడ్లు, పండ్లు, కూరగాయలతో కూడిన భోజనం పెట్టాలన్నారు. అంతకు ముందు బోర్లం క్యాంప్ తండాలో తాగునీటి సమస్యను తెలుసుకుని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో బషీరుద్దీన్, స్థానిక ప్రజాప్రతినిధులు సంగం శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, రతన్, దేవిసింగ్ తదితరులు ఉన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం



ఆందోళన చేపడుతున్న మృతుడి బంధువులు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో యువకుడి మృతికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో రవికుమార్ శుక్రవారం అన్నారు. మెండోరకు చెందిన రెవెన్యూ అధికారి కాలితో తన్నడం వల్లే శివారం టిప్పర్ కింద పడి మృతిచెందాడని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువుల స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. యువకుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా యువకుడు శివారం మృతికి మెండోరా డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ కారణమంటూ మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా ప్రమాదానానికి కారణమైన డీటీ రాజశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

త్వరలో ఆరు గ్యారంటీల అమలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పిట్లం(జుక్కల్) : అతి త్వరలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందని, రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఈ నెలఖరులోగా అమల్లోకి వస్తాయని అదే విధంగా రైతు రుణమాఫీ కూడా అమలు చేస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పిట్లం మండలంలోని బండపల్లి, బండపల్లి తండా, కోమటిచెరువు తండా, బొగ్గులకుంట తండా, మద్దెలచెరువు, బొల్లక్‌పల్లి గ్రామాలలో విజయోత్సవ సభలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరి కష్టానికి తగిన ఫలితం ఉంటుందని, ఎవ్వరికీ ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే విధంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఎండాకాలం వస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నిధులు కేటాయించి గ్రామాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. జుక్కల్ నియోజకవర్గానికి ఇక మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే నాయకులతో కలిసి పలు తండాల్లోని సేవాలాల్ మహరాజ్, మహంకాళి మాత ఆలయలలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed (TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 3 నెలల్లో కోర్స్ పూర్తిచేసే అవకాశం. ఫోన్: 8886977112,339. [HA-13295]

SERVICES

FINANCE SERVICES
■ సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226. [W-788999]

BUSINESS OFFER
■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9989214214. [HA-787728]
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

CHANGE OF NAME
■ I, PEDDA RAMESH S/o. KANOOR ASHANNA R/o. H.No. 1-120 Marampally (V), Nandipet (M), Nzb (D). Have Changed my Name as KANOOR RAMESH S/o. KANOOR ASHANNA [Z-1105927]
■ I, VEMULA MADHU BHOJANNA S/o. VEMULA BHOJANNA R/o. H.No. 1-45/4 Perkit, Armoor (M), Nzb (D). Have Changed my Name as VEMULA MADHU S/o. VEMULA BHOJANNA [Z-1105928]
■ I, PEESU AKHILA D/o. PEESU GANGA REDDY (Old Name) Changed my Name as NADKUDA AKHILA W/o. NADKUDA DILEEP (New Name), R/o. H.No. 7-1/7, Velpur Village, Nizamabad (T.S.) [Z-795681]
■ I, BHARMAROUTHU JAGADISWAR S/o. BHARMAROUTHU GANGADHAR (Old Name) Changed my Name as BRAMMAROUTHU JAGADISHWAR S/o. BRAMMAROUTHU GANGADHAR (New Name) Balkonda Vill and Man, Dist: NZB. [Z-795682]

WANTED
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9030675274. [M-1233797]
■ హరేకృష్ణ హోమ్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-793694]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

కోర్టుకు హాజరుకానందున అరెస్ట్

ఖలీల్‌వాడి: కోర్టు వాయిదాలకు హాజరు కాని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని అంబేద్కర్‌కాలనీకి చెందిన ఎర్రోళ్ల గంగాధర్‌పై ఓ వివాదంలో కేసు నమోదైంది. దీంతో కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. జడ్జి ఆదేశాల మేరకు గంగాధర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వంట గ్యాస్ లీకై మంటలు



బోధన్‌టౌన్: పట్టణంలోని ఓ ఇంట్లో వంట గ్యాస్‌లీకై మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక అధికారులు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గోశాల కాలనీలో నివాసం ఉంటున్న హన్మాండ్లు ఇంట్లో గ్యాస్‌లీకై మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన కుటుంబీకులు బయటకు వచ్చారు. కాలనీవాసులు అగ్నిమాపక శాఖ కేంద్రానికి ఫోన్ చేయడంతో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని సిబ్బంది తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

రామారెడ్డి: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై కొండా విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డికి చెందిన కుమ్మరి లక్ష్మీపతి(55) పొలం పనులు చేస్తుంటాడు. ఈ నెల 21న ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మీపతి తిరిగి రాలేదు. 22న వ్యవసాయ పొలంలో రాత్రి కుటుంబీకులు వెళ్లి పరిశీలించగా ఉరేసుకొని మృతిచెందినట్లు గుర్తించారు. అప్పులు బాగా పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివిధ కేసుల్లో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ బేకరీ షాప్ యజమానికి జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుభాష్‌నగర్‌లో ఉన్న డ్రీమ్ డిసార్ట్ బేకరీ యజమాని జయంత్‌కుమార్ తన దుకాణంలో కొన్ని నెలలుగా లవర్స్ కోసం ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేసి వారి నుంచి రూ. 300 తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై సమాచారం అందడంతో బేకరీపై దాడి చేసి యజమానిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. దీంతో జడ్జి జయంత్‌కుమార్‌కు రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు తెలిపారు.

రౌడీషీటర్‌కు నాలుగురోజులు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పీఎస్ పరిధికి చెందిన రౌడీషీటర్ నబీకి జడ్జి సయ్యద్ ఖదీర్ నాలుగు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మట్కా కేసులో నబీని కోర్టులో హాజరు పర్చగా జడ్జి జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

పేకాట కేసులో ఐదుగురికి..

ఖలీల్‌వాడి: పేకాట ఆడిన కేసులో ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఎస్సై సంజీవ్ గురువారం తెలిపారు. నగరంలోని బోర్గాం(పి) వాగు పక్కన ఆడుతున్న పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. జడ్జీ వీరికి రెండు రోజుల జైలు శిక్షణు విధించినట్లు పేర్కొన్నారు.

మత్తుపదార్థాలు విక్రయించే వ్యక్తికి రెండు రోజులు..

మాక్లూర్: కళాశాల విద్యార్థులకు మత్తు ఇచ్చే పదార్థాలు విక్రయిస్తున్న ఓ బేకరీ యజమానికి జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముబారక్‌నగర్‌లో ఉన్న బేకరీలో కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక నిఘాతో బేకరీ యజమానిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఆధారాలు పరిశీలించిన జడ్జి అతనికి రెండు రోజుల శిక్షను విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో జాతీయ రహదారి పక్కన ఉన్న రాజస్థాన్ దాబాలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ తెలిపారు. శుక్రవారం జక్రాన్‌పల్లి పీఎస్‌లో సీఐ మల్లేశ్, ఎస్సై తిరుపతి వివరాలు వెల్లడించారు. అర్గుల్ దాబాలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీలో 210 గ్రాముల గంజాయి లభ్యం కావడంతో దాబా యజమాని అశోక్ అలియాస్ దొల్లును అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయితో పాటు రూ. 4వేల నగదు, సెల్, డిజిటల్ వేయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడు దాబాకు వచ్చే లారీ డ్రైవర్లకు గంజాయిని విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్ రూరల్: మండలంలో కల్దుర్కిలో పేకాటస్థావరంపై దాడి చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ శుక్రవారం తెలిపారు. దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.8,990 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మొబైల్ షాపులో చోరీ

లింగంపేట: మండల కేంద్రంలోని మొబైల్ షాపులో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు రూ. 30వేలు విలువ చేసే పరికరాలు, రెండు ఆండ్రాయిడ్ ఫోన్లు చోరీకి గురైనట్లు దుకాణ యజమాని సఫియొద్దీన్ తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు.